క్లుప్తంగా

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



లబ్బీపేట(విజయవాడతూర్పు): స్థానిక 24వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ కుక్కల అనిత శంకుస్థాపన చేశారు. సీతారామపురం రామనాథం వీధిలో రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు, కాజా ముసలయ్యవీధిలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, చలమలవారివీధిలో రూ. 6 లక్షలతో బోరింగ్ పంపు ఏర్పాటు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ రూ. తొమ్మిది కోట్లు వెచ్చించి పనులు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

హోటల్స్, లాడ్జ్‌ల్లో పోలీసు తనిఖీలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె రాణా ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు హోటల్స్, లాడ్జ్‌లలో శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది గాం.దీనగర్, సత్యనారాయణపురం ప్రాంతాల్లోని లాడ్జ్‌లు, హోటల్స్‌ల్లో క్షుణంగా తనిఖీలు చేపట్టారు. రిజిష్టర్లను తనిఖీ చేసి అనుమానితుల ఆధారాలను పరిశీలించారు. హోటల్స్‌కు వచ్చే వారి గుర్తింపు కార్డులు, పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైన అనుమానిత వ్యక్తులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా నిర్వాహకులకు సూచించారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్సార్ సీపీలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, పార్టీ పటిష్టతకు సమన్వయంతో పని చేయాలని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 30వ డివిజన్ బుడమేరు మధ్యకట్టలో శనివారం టీడీపీకి చెందిన పలువురు కార్పొరేటర్ బీ జానారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ పేదల పార్టీ అని ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ గోగుల వెంకటరమణరావు, నాయకులు దుర్గారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఆంజనేయ వాగు దుక్కా తిరుపతమ్మ వీధికి చెందిన ఎం.జ్యోతి, నాగేంద్రకుమార్ భార్యాభర్తలు. వీరికి వివాహమై 12 సంవత్సరాలు అవుతుంది. వీరికి ఇద్దరు సంతానం. నాగేంద్రకుమార్ గతంలో సిమెంట్ రేకుల కంపెనీ నిర్వహించే వాడు. కంపెనీలో పని చేసే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని కుటుంబాన్ని సరిగా పట్టించుకోవడం లేదు. దీనిపై ప్రశ్నించిన భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పేదలకు స్థలాలు ఇచ్చిన ఘనత జగనన్నదే

- ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)
- టిడ్కో, జగనన్న కాలనీల గృహ స్వాధీన ధ్రువీకరణ పత్రాల పంపిణీ



దివ్యాంగురాలికి టిడ్కో గృహ స్వాధీన పత్రం అందజేస్తున్న కేశినేని నాని, వెలంపల్లి, ఆసిఫ్, భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శ్రీనివాస్ (నాని) తెలిపారు. విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యాన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన టిడ్కో 300 ఎస్ఎఫ్‌టీ ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలతోపాటు 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా గృహ స్వాధీన ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 5 లక్షల ఇళ్లు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే చంద్రబాబు ఒక్కరికి కూడా ఇళ్లు ఇచ్చిన పాపాన పోలేదని గుర్తు చేశారు. ఈ ఒక్క విషయంలోనే రూ. 5 వేల కోట్ల స్కామ్‌కు పాల్పడ్డ చంద్రబాబు అసమర్థ, అవినీతి పరుడని మండిపడ్డారు. రాష్ట్రంలో కోటీ అరవై ఐదు లక్షల కుటుంబాలుంటే అందులో కోటీ ముప్పైఐదు లక్షల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వంలో రూ.30 వేల కోట్ల మేర అభివృద్ధి జరిగితే దుష్టచతుష్టయానికి అవేమీ కనబడవని ధ్వజమెత్తారు. రాజధాని పేరుతో అమరావతిలో మూడు వేల కోట్లు కూడా ఖర్చు పెట్టని చంద్రబాబు మాటలు వింటే పచ్చ కామెర్ల సామెత గుర్తుకు వస్తుందన్నారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే అమరావతిని వాడుకున్నారని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ గత ప్రభుత్వం టిడ్కో ఇళ్ల పేరు చెప్పి 12 వేల మంది దగ్గర డబ్బు వసూలు చేసికూడా వాటిని పూర్తి చేయలేదని గుర్తు చేశారు. సీఎం జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్లల్లో కొన్నింటిని పూర్తి చేశారని, వాటిని లబ్ధిదారులకు ఇప్పుడు ఉచితంగా అప్పగించామని తెలిపారు. చాల మందికి వారు చెల్లించిన డబ్బును జగన్ ప్రభుత్వం వాపసు చేసిందని పేర్కొన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబులా మాట ఇస్తే తప్పే నైజం సీఎం జగనన్నది కాదని స్పష్టం చేశారు. ప్రజలకు మేలు జరగాలంటే జగనన్న ప్రభుత్వానికే సాధ్యమన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల నిర్మాణం పేరుతో పేదల వద్ద నుంచి డబ్బు వసూలు చేయడమే కాకుండా రూ.100 కోట్లు అప్పు చేసిన ఘనుడు చంద్రబాబని ఎద్దేవా చేశారు. దాదాపు 12 వేలమంది వద్ద డబ్బు వసూలు చేసిన చంద్రబాబు ప్రభుత్వం 6వేల మందికి మాత్రమే ఇళ్లు నిర్మించి వాటిని కూడా పూర్తి చేయకుండా వదిలేశారని చెప్పారు. అసంపూర్తి టిడ్కో ఇళ్లను పూర్తి చేయించి లబ్ధిదారులకు ఉచితంగా అందించిన ఘనత జగనన్నదని పేర్కొన్నారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ అభ్యర్థులు దేవినేని అవినాష్, షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రికి రాని ఆలోచనలు జగనన్న చేశారని, తద్వారా రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. అమరావతి ప్రాంతంలో నగర ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేదిక కింద వీల్ చైర్‌పై కూర్చున్న పెజ్జోనిపేటకు చెందిన దివ్యాంగురాలు ఎస్.మల్లేశ్వరికి టిడ్కో గృహ స్వాధీన పత్రాలు, తాళం అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజ రెడ్డి, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ సత్యనారాయణ, పలువురు కార్పొరేటర్లు, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సెంట్రల్ అభ్యర్థి



వెలంపల్లి శ్రీనివాసరావు

నియోజకవర్గం: విజయవాడ సెంట్రల్
అభ్యర్థి పేరు: వెలంపల్లి శ్రీనివాసరావు
పుట్టిన తేదీ: 15–08–1971
విద్యార్హతలు: 10వ తరగతి
కులం: ఆర్యవైశ్య
వృత్తి: వ్యాపారం, రాజకీయాలు
తండ్రి: సూర్యనారాయణ
తల్లి: సీహెచ్ మహాలక్ష్మి
భార్య: శ్రీవాణి
సంతానం: ఒక కుమార్తె
ఇద్దరు సోదరులు, ఇద్దరు సోదరీమణులు

రాజకీయ నేపథ్యం:

- ప్రజారాజ్యం పార్టీ నుంచి రాజకీయ అరంగేట్రం చేశారు. 2009 ఎన్నికల్లో విజయవాడ వెస్ట్ నుంచి పీఆర్పీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు.
- ఆ తర్వాత పీఆర్పీ కాంగ్రెస్‌లో విలీనం కావడంతో కొంత కాలం కాంగ్రెస్‌లో కొనసాగారు.
- 2014 ఎన్నికల ముందు బీజేపీలో చేరి టికెట్ తెచ్చుకున్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు.
- అనంతరం 2016 డిసెంబర్‌లో వైఎస్సార్ సీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. దేవదాయశాఖ మంత్రిగా పనిచేశారు. జిల్లాల విభజన తర్వాత 2022 నుంచి వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.
- ప్రస్తుతం పార్టీ అధిష్టాన నిర్ణయం మేరకు 2024 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు.

సేవా కార్యక్రమాలు:
వెలంపల్లి ఫౌండేషన్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి



రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఐదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 64వ డివిజన్ ఎన్జీఓస్ ఏ కాలనీలో రూ. 20 లక్షల వీఎంసీ జనరల్ ఫండ్స్‌తో నూతనంగా నిర్మించిన ఏడు గ్రావెల్ రోడ్లను నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. టీడీపీ హయాంలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, కేవలం శంకుస్థాపనలు, శిలాఫలకాలతో కాలయాపన చేసి ప్రజలను మభ్యపెట్టారని ఎమ్మెల్యే విష్ణు విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో అభివృద్ధి అంటే ఏంటో చేతల్లో చేసి చూపినట్లు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి తమ ప్రభుత్వంలో వందల కోట్లు ఖర్చు చేయగా, డివిజన్ అభివృద్ధికి అక్షరాల రూ. 22 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, కర్మల భవన్, రహదారుల నిర్మాణంతో ఈ ప్రాంత ముఖ చిత్రాన్ని పూర్తిగా మార్చివేసినట్లు చెప్పారు. ఈ అభివృద్ధి రానున్న రోజుల్లోనూ ఇదేవిధంగా కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, డివిజన్ కోఆర్డినేటర్ ఎస్‌కే ఇస్మాయిల్, యరగొర్ల శ్రీరాములు, కొక్కిలిగడ్డ నాని, బత్తుల శేఖర్, చెక్కా నరసింహారావు, వెంకటేశ్వరమ్మ, స్థానికులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న అధ్యాపకురాలు శుభ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని అధ్యాపకురాలు శుభ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని, తోచినంతలో సేవ చేయడంతో పాటు బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని సూచించారు. కళాశాల ఆంగ్ల విభాగాధిపతి కేఎల్‌సీ దేవి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్థిరపడాలని అప్పుడే సాధికారత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో స్వచ్ఛభారత్..

మధురానగర్(విజయవాడసెంట్రల్): వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ సూచించారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం పచ్చదనం, పరిశుభ్రతకు అత్యంత ప్రాముఖ్యతను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు బాధ్యతను నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు.

ద్విచక్ర వాహనం ఢీ కొని గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనం ఢీ కొని రెండు వేర్వేరు ఘటనల్లో ఇరువురు గాయపడినట్లు శనివారం గుణదల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గులాబీతోటకు చెందిన పాకలపాటి దీనమ్మ భానూనగర్ జంక్షన్ నుంచి పడవలరేవు వైపు రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన దీనమ్మను ప్రైవేటు ఆసుపత్రిలో జాయిన్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కేఎల్ రావు నగర్ చిట్టినగర్‌కు చెందిన ఆకుమర్తి కిరణ్‌కుమార్ బీఆర్‌టీఎస్ రోడ్డు పడవలరేవు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో గాయపడిన కిరణ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరోగ్యకర సమాజస్థాపనకు ఓపెన్ జిమ్



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యకర సమాజ స్థాపనకు తాము నగరంలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడామైదాన ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త దేవినేని అవినాష్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యానవనాలను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజల విజ్ఞప్తి మేరకు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజల అవసరాల మేరకు తాము చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ ప్రజలందరికీ ఉపయోగపడేలా తాము ఇక్కడ ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రల్‌లో తిరుగులేని మెజార్టీ సాధిస్తాం

సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



59వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): రానున్న ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గంలో తిరుగులేని మెజార్టీతో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 'ప్రతీ గడపకు వెలంపల్లి శ్రీనివాస్' కార్యక్రమం 59వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్‌లో శనివారం కోలాహలంగా జరిగింది. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినాసుల్తానాతో కలిసి ఆయన డివిజన్‌లోని పలు ప్రాంతాలను సందర్శించారు. ముందుగా తెలుగు బాప్టిస్టు చర్చిలో మత గురువుల ఆశీర్వచనం తీసుకుని పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంపూర్ణ న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు దోహదపడతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు అన్నీ ఏకమై ఎన్ని అసత్యాలు ప్రచారం చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. పలు నివాసాలను సందర్శించి స్థానిక ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడే వాటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. పాదయాత్రలో భాగంగా లూనా సెంటర్‌లో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రీడింగ్ రూమ్ వ్యాయామశాలను ఆయన ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు సురేష్, కంబగళ్ల రాజు, ఎండీ హాఫిజుల్లా, కోలా శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

భగవంతుడి సేవతో అంతులేని తృప్తి



తిరుమల శ్రీవారి సన్నిధికి వెళ్లే లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న నిర్వాహకులు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఎంతో ఉత్కృష్టమైన మానవ జన్మలో భగవంతుడికి సేవ చేసుకునే మహద్భాగ్యం దక్కడం భగవంతుని ఆజ్ఞగా భావిస్తున్నానని, నిత్యాన్నదాన సేవలో పాలు పంచుకునే అవకాశం పూర్వ జన్మ సుకృతమని ప్రముఖ వైద్యుడు ఎస్వీ రంగారావు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదానానికి దాతల సహకారంతో ఉడతా భక్తి సాయంగా మరడ నాగేంద్ర ఆధ్వర్యంలో సూర్యారావుపేటలోని ఆర్కే హాస్పిటల్ వద్ద నుంచి శనివారం బయలుదేరిన కూరగాయల వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు లక్షలాది మందికి అన్నప్రసాదం అందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం చేస్తున్న బృహత్కార్యంలో తాను భాగస్వామి కావడం భగవంతుడి ఆజ్ఞగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సాక్షాత్తు కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే ఒక అద్భుతమైన అన్నప్రసాద కార్యక్రమం గత మూడు దశాబ్దాలుగా నిరాఘాటంగా సాగడం అద్భుతమన్నారు. ప్రతీ ఒక్కరికి ఉండే మత విశ్వాసాల ఆధారంగా వారి వారి విశ్వాసాల ప్రకారం భగవదనుగ్రహం పొందడం కోసం చేసే సేవల్లో ఆహారం పంపిణీ చాలా ప్రాధాన్యత సంతరించుకుంటుందని వివరించారు. కార్యక్రమ నిర్వాహకులు ఎం.నాగేంద్ర, డా.త్రిపురసుందరి, డాక్టర్.ఈశ్వర్, డా.రత్న, భక్తులు పాల్గొన్నారు.

చారిత్రక పురుషుడు పొట్టి శ్రీరాములు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న హజరత్తయ్య గుప్తా

పాయకాపురం(విజయవాడరూరల్): భాషా సంయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి ఆమరణ దీక్ష బూని అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రతీ తెలుగువారి గుండెగుడిలో పూజింపబడే ప్రాతఃస్మరణీయుడని, చారిత్రక పురుషుడు అని సాంఘిక సామాజిక సేవకుడు, వాసవి క్లబ్స్ అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం రాజీవ్‌నగర్‌లోని వాసవి భవన్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడిచిన గాంధీయవాది పొట్టి శ్రీరాములని హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించి సామాజిక స్పృహ ప్రబలం చేసిన తాత్వికవేత్త, సంఘసంస్కర్త అని కొనియాడారు. ప్రతి తెలుగువాడు అటువంటి వారి ఆశయాలను ప్రేరణగా తీసుకుని సత్సంకల్పంతో సేవలందిస్తూ ముందుకు సాగాలన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయక చరిత్రను సృష్టించిన ఖ్యాతి పొట్టి శ్రీరాములదన్నారు. వాసవి క్లబ్ సభ్యులు పాల్గొని పొట్టి శ్రీరాములకు ఘన నివాళులర్పించారు.

వీధి దీపాల ఏర్పాటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దావు బుచ్చయ్య కాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ బీ జానారెడ్డి పర్యటించినప్పుడు స్థానికులు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెలంపల్లి అధికారులతో మాట్లాడి వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. అడిగిన వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయించినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక నగదు ఆశజూపి రూ.1.60 లక్షలు టోకరా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం ఉద్యోగం ఆశజూపి రూ.1.60 లక్షలు మోసం చేసిన ఘటనపై సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శంకర సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి వన్‌టౌన్‌లోని ఓ బ్యాంకులో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ సత్యనారాయణపురంలోని శివరావువీధిలో నివాసముంటున్నాడు. గత ఏడాది అక్టోబర్ 7వ తేదీన జీల్ట్ డిజిటల్ మార్కెట్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎక్కువ డబ్బులు సంపాదించుకోవచ్చంటూ సుహాసిని అనే యువతి సుబ్రహ్మణ్యంకు ఫోన్‌చేసి నమ్మించడంతో అతను రూ.1,500 చెల్లించి అందులో చేరాడు. మొదట్లో ఒక్కో పని అప్పగించి ఆ పనికి రూ. 150 చొప్పున ఇస్తామని చెప్పి ఒకసారి రూ.2,000, మరోసారి రూ. 2,800 ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యానికి పంపించడంతో ఆసంస్థపై నమ్మకం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే సదరు యువతి క్షణయ అనే మరో యువతిని సుబ్రహ్మణ్యంకు పరిచయం చేసింది. ఆమె సుబ్రమణ్యం చేస్తున్న పని, వస్తున్న ఆదాయం వివరాలు అడిగి తెలుసుకుంది. అనంతరం ఆసంస్థలో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో అధిక ఆదాయం పొందవచ్చని నమ్మించడంతో అదేనెల 29వ తేదీన పలు దఫాలుగా సుబ్రహ్మణ్య రూ.1.60లక్షలు ఆమె చెప్పిన ఖాతాకు పంపించాడు. అప్పట్నుంచి క్షణయతో పాటు వారి ఫోన్లు పనిచేయపోవడం తాను మోసపోయినట్లు గుర్తించిన సుబ్రమణ్యం ఎస్ఎన్ పురం పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 32వ డివిజన్‌లో క్యాన్సర్‌తో మరణించిన చింతల నాగలక్ష్మి కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా మట్టిఖర్చులకు గానూ రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. వార్డు సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్ నాగలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి నగదు అందజేశారు. తక్కిన బీమా నగదు బ్యాంకు ఖాతాలో జమచేయడం జరుగుతుందని తెలిపారు.





